క్లుప్తంగా

పోక్సో కేసు నమోదు

వలిగొండ : బాలికను వేధించిన వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన ఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదారాబాద్‌కు చెందిన తాళ్ల సంతోష్ మండలంలోని అరూరు గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికను వేదించిన ఘటనలో బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు చేశారు. దీంతో సీసీ కెమెరాల ద్వారా నిందితుడిని గుర్తించిన పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ యుగందర్ తెలిపారు.

మోటకొండూర్ వాసికి డాక్టరేట్


డాక్టరేట్ పట్టాతో చిలక సుధాకర్

మోటకొండూర్ : మోటకొండూరు మండల కేంద్రానికి చెందిన రెవ చిలక సుధాకర్ రావుకు డాక్టరేట్ పొందారు. బుధవారం ఏసీఈ డయాసిస్ ఇంటర్నేషనల్ కొత్తపేట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో హోలీ బైబిల్‌కి సంబంధించిన డాక్టరేట్ ప్రదానం చేశారు. బైబిల్ లోని వివిధ అంశాలపై బిషప్. డా. సుంచు ప్రకాష్‌రావు పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆంగ్లికన్ క్లర్జీ ఎపిస్కోపల్ ఆఫ్ డైసిస్ వారు గౌరవ డాక్టరేట్ అందజేశారు.

క్రీడల్లో మంచి పేరు తేవాలి

భువనగిరిటౌన్ : క్రీడల్లో భువనగిరి పట్టణానికి మంచి పేరు తేవాలని పీఎస్‌సీ ఫౌండేషన్ చైర్మన్ పచ్చల జగన్ మోహన్ అన్నారు. బుధవారం భువనగిరి పట్టణంలోని భీష్మ క్రికెట్ క్లబ్ సభ్యులకు స్పోర్ట్స్ క్రికెట్ టీ షర్ట్స్ అందించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

వలిగొండ : భూగర్భ జలాల అడుగంటి నీరు అందక పంట పొలాలు ఎండిపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి అన్నారు. బుధవారం ఆయన సీపీఎం నాయకులతో కలిసి సుంకిశాలలో ఎండిపోయిన పంటపొలాలను సందర్శించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొండే క్రిష్టయ్య, మంగ బాలయ్య, పోలపల్లి పెద్ద స్వామి, పోలేపల్లి ఉప్పలయ్య, రైతులు మొగిలిపాక ఎల్ల స్వామి, పోలేపల్లి స్వామి, బాల నరసింహ, మొగిలిపాక కిష్టయ్య, పోలేపల్లి స్వామి, ఈతాప సత్తయ్య, నరసింహ పాల్గొన్నారు.

గోవుల పట్టివేత

భువనగిరిటౌన్ : హైదరాబాద్‌కు తరలిస్తున్న గోవులను బుధవారం తెల్లవారుజామున భువనగిరిలో భజరంగ్ దళ్ కార్యకర్తలు అడ్డుకున్నారు. భద్రాచలం నుంచి హైదరాబాద్ బహద్దూర్ పుర జంతు వదశాలకు ఆవులను తరలిస్తున్నట్టు సమాచారం అందుకున్న భజరంగ్ దళ్ కార్యకర్తలు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకుభువనగిరి బైపాస్ రోడ్డుపై ఆవులను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని 21 ఆవులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆవులను హైదరాబాద్ జియాగూడ గోషాలకు తరలించారు. వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఇన్‌స్పెక్టర్ కె.సురేశ్ కుమార్ తెలిపారు. భజరంగ్ దళ్ జిల్లా కన్వీనర్ బింగి భరత్ కుమార్, పట్టణ కన్వీనర్ నెమిలి నవీన్, ఉడుత ఆనంద్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు

త్రిమూర్తి శివ జయంతి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వడ్లోజు వెంకటేష్, పుప్పాల నర్సింహ

యాదగిరిగుట్ట : పట్టణంలోని ప్రజాపిత బ్రహ్మ కుమారి విద్యాలయంలో బుధవారం మహాశివరాత్రిని పురస్కరించుకొని 89వ త్రిమూర్తి శివ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ లోకల్ అడ్వయిజర్ మాజీ మెంబర్ వడ్లోజు వెంకటేష్, మదర్ డెయిరీ డైరెక్టర్ పుప్పాల నర్సింహలు శివుడి చిత్రపటానికి పూజలు చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి, శివుడి చిత్రంతో కూడిన జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి నాగలక్ష్మి, ఓం శాంతి సభ్యులు జానకిరామ్, నరహరి, వెంకట్ రెడ్డి, బడుగు మల్లేష్, సతీష్, రాజ్యలక్ష్మి, శాంతి, నీరజ, శోభ తదితరులున్నారు.

వేములకొండ సీపీఎం గ్రామ కార్యదర్శికి నివాళి

వలిగొండ : మండలంలోని వేములకొండ సీపీఎం గ్రామ కార్యదర్శి కొలగాని వెంకటేశం మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. బుధవారం సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ ఆ గ్రామంలో వెంకటేశం మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ జిల్లా కమిటీ సభ్యులు రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ.. శంభో శంకర


భువనగిరి : పచ్చలకట్టసోమేశ్వరాలయంలో బారులుదీరిన భక్తులు


భూదాన్‌పోచంపల్లి : మార్కండేశ్వరస్వామి దేవాలయంలో ఉమామహేశ్వర వ్రతంలో పాల్గొన్న భక్తులు


గుండాల : సూనెగూడెం శివాలయంలో పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య దంపతులు, నాయకులు

యాదాద్రి భువనగిరి జిల్లాలో శివరాత్రి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల ఎదుట పెద్ద ఎత్తున బారులుదీరారు. శివాలయాలన్ని శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులు ఆలయాల్లో శివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం అంగరంగావైభవంగా నిర్వహించారు. పలు చోట్ల భక్తులకు పండ్లు, పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. – సాక్షి, నెట్ వర్క్


రామన్నపేట : వెల్లంకి శివాలయంలో..


రామన్నపేట : శివపార్వతుల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు


బీబీగర్ : మహాదేవ్‌పురంలో శివపార్వతుల కల్యాణం నిర్వమిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు


యాదగిరిగుట్ట రూరల్ : సైదాపురం వీరభద్రస్వామి ఆలయంలో..


మోత్కూరు : రామలింగేశ్వర దేవాలయంలో..


మోత్కూరు : దేవాలయం ఆవరణలో భక్తులకు పండ్లు పంపిణీ చేస్తున్న ముస్లింలు


వలిగొండ : సంగెం భీమలింగం వద్ద..


ఆత్మకూరు(ఎం) : కొరటికల్‌లో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


అడ్డగూడూరు : కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


సంస్థాన్ నారాయణపురం : ప్రాచీన శివాలయంలో.. బారులుదీరిన భక్తులు


బొమ్మలరామారం : మర్యాలలో శివపార్వతుల కల్యాణం


రాజపేట : రేణికుంట శివాలయంలో..

ఇసుక లారీలు సీజ్

భూదాన్‌పోచంపల్లి : నిబంధనలకు విరుద్ధంగా అధికలోడుతో వెళ్తున్న రెండు ఇసుక లారీలను పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. ఎస్ఐ భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఏపీలోని చిన్నగంజాం, బాపట్ల నుంచి ప్రభుత్వ నిబంధలకు విరుద్ధంగా లారీల్లో అధిక లోడుతో ఇసుకను నారాయణగిరిలోని ఇటుక బట్టీలకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కొత్తపల్లి శ్రీను, బత్తుల రాజులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పనులు పూర్తిచేయాలి

భువనగిరిటౌన్ : బస్వపురం నుంచి వచ్చే కాలువ పనులు పూర్తి చేసి భువనగిరి పట్టణంలోని గచ్చుబాయి చెరువు నింపేందకు చర్యలు తీసకోవాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం భువనగిరి బైపాస్ రోడ్ దీప్తీ హోటల్ వద్ద రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బైపాస్ రోడ్డు కాల్వ హైవే కటింగ్ వర్క్ ఆలస్యం అవుతున్న కారణంగా భువనగిరి మండల గ్రామాల రైతులకు ఏ విధంగా సాగునీరు అందించాలనే దానిపై అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు.

ఎల్‌ఓసీ అందజేత

వలిగొండ : మండలంలోని సుంకిశాలకు చెందిన జిట్ట యాదగిరి ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.1.25లక్షల ఎల్‌ఓసీని బుధవారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మాజీ మున్సిపల్ ఛైర్మెన్ లు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జహంగీర్, వీరాస్వామి, మధు పాల్గొన్నారు.

ఘనంగా హజ్రత్ గాలీబ్ షాహిద్ దర్గా ఉర్సు

సంస్థాన్ నారాయణపురం : మండలంలోని రాచకొండలోని హజ్రత్ గాలీబ్ షాహిద్ దర్గాలో ఉర్సు బుధవారం ఘనంగా నిర్వహించారు. దర్గాను దర్శించుకున్నారు. దర్గాపై దట్టీలను కప్పి, పూలను వేసి మొక్కులను తీర్చుకున్నారు. భక్తులు శుక్రవారం సాయంత్రమే దర్గా వద్దకు చేరుకొని వంటకాలు చేసుకొని, నిద్రలు చేశారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం) : మండలంలోని పల్లెర్లలో నిరుపేద కుటుంబానికి చెందిన చేనేత కార్మికుడు గుర్రం లింగస్వామి(44) బుధవారం మృతిచెందారు. సీపీఎం ఆధ్వర్యంలో మృతదేహంపై ఆ పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ.5వేలను అందజేశారు. అలాగే కేహెచ్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5వేలను ఆర్థిక సాయంగా అందజేశారు. అలాగే మండలంలోని రహీంఖాన్‌పేటలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అన్నదమ్ములు గూడూరు చంద్రశేఖర్, మత్స్యగిరి మృతిచెందడంతో కేహెచ్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10వేలను ఆర్థిక సాయంగా అందజేశారు.

భక్తిభావం పెరగడం సంతోషదాయకం

ఆత్మకూరు(ఎం) : గ్రామీణ ప్రాంతాల్లో భక్తిభావం పెరగడం సంతోషదాయకమని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కూరెళ్లలోని త్రికుటాలయ శివాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం మాట్లాడారు. దేవాలయాల నిర్మాణాలకు దాతలు ముందుకు రావడంతో పురాతన దేవాలయాలు కూడా పునఃనిర్మాణం అవుతున్నాయని చెప్పారు. కూరెళ్ల గ్రామానికి చెందిన మోతె పిచ్చిరెడ్డి–పూలమ్మ దంపతుల దాతృత్వంతో పురాతనమైన దేవాలయాన్ని నిర్మించడం వారిని అభినందించదగ్గ విషయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, మాజీ డీసీసీబీ చైర్మన్ మోతె సోమిరెడ్డి, దేవాలయ నిర్మాణ దాత, డీఎల్‌డీఏ మాజీ చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి, నార్మాక్స్ మాజీ డైరెక్టర్ మోతె పూలమ్మ, మాజీ సర్పంచ్ ఉప్పలయ్య యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ పద్మ పాల్గొన్నారు.

మల్లన్నగుట్టపై బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

రామన్నపేట : మండలంలోని నిధానపల్లి మలన్నగుట్టపై శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మశ్రీ బేతోజు సత్యనారాయణశాస్త్రి అర్చకత్వంలో గణపతిపూజ, స్వస్తివాచనము, నవగ్రహ, అష్ట దిక్పాలక, పంచబ్రహ్మల, పంచాచార్య, క్షేత్రపాలక పూజలను నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణము చేసి సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. గ్రామపంచాయతీ నుంచి భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఉత్సవ విగ్రహాలను మహిళలు, మంగళహారతులు నృత్యాలు, డప్పుచప్పుల్లతో గుట్టపైకి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ గుత్తా నర్సింహారెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మెన్ చల్ల భిక్షంయాదవ్ సభ్యులు కొణతం నాగభూషణం, వలమల్ల మల్లయ్య, పోతగాని భాగ్యమ్మ, నారపాక రాజు, నరేష్, చల్ల నర్సింహ, ఎక్స్‌అఫీసియోమెంబర్ బేతోజు శశిధర్ దీక్షితులు భక్తులు మందడి సంతోష్‌రెడ్డి, కొండ మల్లేశం పాల్గొన్నారు.

స్వర్ణగిరిలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి : పట్టణంలోని స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం కొనసాగాయి. ఈ సందర్భంగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆయనకు ఆలయ ధర్మకర్తలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. అంతకు ముందు ఆలయంలో చతుస్థానార్చన మూర్తి కుంభం హోమం, హయగ్రీవ ఇష్టి హవనం, అనంతరం అశ్వవాహన సేవ, ఆలయ గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ మానేపల్లి రామారావు, ధర్మకర్తలు మురళీకృష్ణ, గోపి కృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలి

భూదాన్‌పోచంపల్లి : ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు, మైనింగ్ శాఖ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల లారీ ఓనర్స్ అసోషియేషన్ నాయకులు రామస్వామి అంజిరెడ్డి, మల్లారెడ్డి అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ కొందరూ అక్రమార్కులు కంపెనీల పేరుతో ఆంధ్రప్రదేశ్ నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని అన్నారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న ఇటుక బట్టీలకు ఇసుకను సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. దీంతో రాష్ట్ర ఖజనాకు గండి పడుతుందన్నారు. తాజాగా బుధవారం పోచంపల్లి మండలంలో ఏపీ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలను పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. గతంలో ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల దృష్టికి తీసుకొచ్చామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు గూడురు యాదిరెడ్డి, సంపత్‌రెడ్డి, బంటు శ్రీశైలం, తిరుమల్ రెడ్డి, సందీప్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, కృష్ణ ఉన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది



భువనగిరి : పట్టణంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు


వలిగొండ : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శేఖర్‌రెడ్డి


చౌటుప్పల్ : పోలింగ్ కేంద్రంలో బ్యాలెట్ బాక్స్‌ను సరిచూసుకుంటున్న సిబ్బంది

భువనగిరి : ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గురువారం నిర్వహించనున్న పోలింగ్‌కు పట్టణంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఈ పోలింగ్ కేంద్రంలో మొత్తం ఓటర్లు 209 మంది ఉన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద భారీ పోలీస్ బందో బస్తూ ఏర్పాటు చేశారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ హనుమంతరావు పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు గురించి సిబ్బందిని అడిగి గెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రంలో వసతులు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి సమస్యలు రాకుండా పోలీస్ బందోబస్తూ ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు.

భూదాన్‌పోచంపల్లి : మండలంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలోని 137 నెంబర్ బూత్‌లో ఏర్పాటుచేసిన పోలింగ్‌బూత్‌ను సందర్శించారు. బ్యాలెట్‌బాక్సులు, బ్యాలెట్ పత్రాలను సరి చూసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 48 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఓటరు ఐడీ కార్డుతో పాటు ఏదేని గుర్తింపు కార్డు వెంట తీసుకొని రావాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రం సమీపంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు.

యాదగిరిగుట్ట : వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సంబంధించిన యాదగిరిగుట్ట పట్టణంలోని యాదగిరిపల్లిలో పోలింగ్ బూత్ నంబర్ 128లో ఏర్పాట్లను ఎన్నికల అధికారులు పూర్తి చేశారు. ఈ పోలింగ్ బూత్‌లో మొత్తం 67మంది ఉపాధ్యాయులు తమ ఓటును వినియోగించుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు. పోలింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తూ ఏర్పాటు చేశారు.

ఆత్మకూరు(ఎం) : వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది బుధవారం ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చేరుకున్నారు. మండలంలో మొత్తం 46 ఓట్లు ఉండగా పురుషులు 27మంది, స్త్రీలు 19 మంది. సమయం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు అని, ప్రతి ఒక్క ఓటరు సమయ పాలన పాటించి ఓటు హక్కు వినియోగించుకోవాల్సిందిగా తహసీల్దార్ రవికుమార్ కోరారు.

గుండాల : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి సిబ్బంది చేరుకున్నారు. మండల వ్యాప్తంగా 18 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు చెప్పారు. పురుషులు 12, స్త్రీలు 6 మంది ఓటర్లు ఉన్నారు. మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రంలో వసతులను ఎంఆర్ఐ అనసూయ పరిశీలించారు.

బొమ్మలరామారం : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రానికి బుధవారం సాయంత్రం చేరుకున్నారు. భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. పోలింగ్ కేంద్రంలో సిబ్బందికి అవసరమైన మౌలిక వసతుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను, పోలింగ్ సమాగ్రిని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దారు శ్రీనివాసరావు, ఎంఆర్ఐ వెంకట్ రెడ్డి, పలువురు అధికారులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

వలిగొండ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నేపథంయలో శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డి బుధవారం పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని బుధవారం ఆర్డీఓ వి.శేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు. పోలింగ్ బూత్‌లోని 108 మంది ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకున్నట్టు ఆయన తెలిపారు. పకడ్బందీగా పోలీస్ బందోబస్తు సైతం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మోత్కూరులో 70మంది ఓటర్లు

మోత్కూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గురువారం నిర్వహించే పోలింగ్‌లో 70 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇప్పటికే ఏర్పాట్లను పోలింగ్ అధికారులు సిద్ధం చేశారు. ప్రిసైడింగ్ ఆఫీసర్ ఆర్.సత్యనారాయణ, మైక్రో అబ్జర్వర్‌తో పాటు మరో నలుగురు సిబ్బంది ఎన్నికల నిర్వహణలో పాల్గొంటారు.

రామన్నపేట : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ సి.లాల్‌బహదూర్‌శాస్త్రి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌కేంద్రంలో 59మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. వారిలో 37మంది పురుషులు, 22మంది మహిళా ఓటర్లు ఉన్నారు.


మోత్కూరు : పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బంది


యాదగిరిగుట్ట : పోలింగ్ బూత్ నంబర్ 128లో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు